శతజయంతి ప్రచురణ

# స్ఫూర్తిశిఖరం

దీర్ఘకావ్యం

## కె. ఆనందాచారి



1913 - 2013

సుందరయ్య విజ్ఞానకేంద్రం

అనం-స్ఫూర్తి
94269



# స్ఫూర్తిశిఖరం

కె. ఆనందాచారి

# స్ఫూర్తిశిఖరం

## మహామనీషి పుచ్చలపల్లి సుందరయ్య

దీర్ఘకావ్యం

కె. ఆనందాచారి




సుందరయ్య విజ్ఞాన కేంద్రం
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్

894.827132
అనం - స్ఫూర్తి

SPHOORTHISIKHARAM

Long Poem

**K. Anandachary**

C-23820

స్ఫూర్తిశిఖరం

కె. ఆనందాచారి

ప్రథమ ముద్రణ: మే, 2013

ముఖచిత్రం: చిత్ర

వెనక అట్ట మీది చిత్రం: కె. ఆనందాచారి

బుక్ డిజైన్: జుగాష్‌విలి

డి.టి.పి.: సి.హెచ్. రమేష్

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

ప్రతులకు:

సుందరయ్య విజ్ఞానకేంద్రం, బాగ్‌లింగంపల్లి

ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

వెల: 20/- రూపాయలు

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A.C.No 94269
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

# ఆనంద సుందరం

## దేవిప్రియ

''ఒక్కడివో, అనేకుడివో
ఆవేశానివో, ఆశయానివో
సహనానివో, సమూహానివో
ఉద్యమ భాషవో, విప్లవ శ్వాసవో
ఏదో ఏమి, అన్నీ నీవైన వాడివి, వేడివి..''

పుచ్చలపల్లి సుందరయ్య గారి శిఖర సమాన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే ప్రయత్నంలో సోదరులు ఆనందాచారి రాసిన పంక్తులు ఇవి. ఈ మాటలతోనే ఆయన తన దీర్ఘ కవితను ప్రారంభించారు. సుందరయ్య గారి విప్లవ రాజకీయాలతో, పార్లమెంటరీ ప్రజా రాజకీయాలతో ప్రభావితమైన పలువురు నాయకులూ, లక్షలాది మంది పార్టీ కార్యకర్తలూ వున్నారు. ప్రగతివా, విప్లవపార్టీల అనుకూల మేధావులలో, రచయితలలో, కవులలో, గాయకులలో సుందరయ్య గారి అభిమానులు, కొన్ని మినహాయింపులతోనైనా, తగిన సంఖ్యలో వుండి వుంటారని నా విశ్వాసం. నా మటుకు నాకు సుందరయ్య గారంటే చాలా ఇష్టం. జానపద సినిమాలు వెర్రిగా చూసే చిన్నతనంలో సుందరయ్యగారు నాకొక 'కత్తి పట్టిన రైతు', ఒక కొండవీటి దొంగ, ఒక రాబిన్‌హుడ్'. పెరిగి పెద్దయ్యాక ఆయనతో గంటలు గంటలు మాట్లాడాలని అనుకుంటూ వుండేవాడిని కానీ అది జరగనే లేదు.

మనకి చరిత్ర విలువ తెలియదు. చరిత్ర సృష్టించిన వాళ్ళనీ, చరిత్రని మలుపు తిప్పిన వాళ్ళనీ, చరిత్రలో జరిగిన అన్యాయాలని నూతన ప్రజాస్వామిక ఆలోచనలతో, సరిదిద్దడానికి పూనుకున్న వాళ్ళని స్మరించుకోవడమూ, వారి స్మృతులను భద్రపరుచుకోడమూ, తదనంతర తరాలకి మార్గదర్శకంగా, దిక్సూచిగా, స్ఫూర్తిగా వారిని గురించి గానం చేయడం, సాహిత్యం సృజించడం- ఇవి యేవీ మన పని కాదనుకుంటాము. సుందరయ్యగారి ఆత్మకథ ఈ మాత్రంగానైనా గ్రంథస్థమై వున్నందుకు ఆయనతో కలిసి పనిచేసిన ఆనాటి నాయకులూ, పార్టీ ముఖ్యులకి మనం ధన్యవాదాలు తెలియచేయాలి. సుందరయ్యగారిని గురించి ఎన్ని పుస్తకాలు వచ్చాయో నాకు తెలియదు. నాకు తెలిసినంతవరకు ఆయన మీద ఒక మంచి

డాక్యుమెంటరీ సినిమా కూడా లేదు. నిజానికి ఈ పాటికి సుందరయ్యగారికి సబంధించిన అన్ని జ్ఞాపకాలతో ఒక పూర్తిస్థాయి ఆర్కైవ్స్‌ని అభివృద్ధి చేసి వుండవలసింది.

"కొందరు మనుషులెందుకు అంటరానివారు, కొందరెందుకు ఆకలి కత్తులకు తెగి పడుతున్నారు?" ఎంత నిరాడంబరమైన, ఎంత సరళమైన శైలి! ఎంత అవసరమైన ప్రశ్నలు! సుందరయ్యగారు తెలంగాణా సాయుధ పోరాట విరమణ నిర్ణయాన్ని ప్రభావితం చేయడం గురించి సాగుతున్న చర్చ ఇప్పట్లో తెగేది కాదు కానీ, సుందరయ్యగారు, రావినారాయణ రెడ్డి, తరిమెల నాగిరెడ్డి వంటి కమ్యూనిస్టు దిగ్గజాలు ఆనాడు అవలంభించిన రాజకీయవైఖరి ఆ వెనువెంట వచ్చిన ప్రజారాజకీయ శక్తులను యెన్ని విధాల ప్రభావితం చేశాయో మనకి తెలుసు. ఆ చరిత్ర నేటికీ నడుస్తూనే వుంది. సుందరయ్యగారిని భారత విప్లవ వ్యూహకర్తగా అభివర్ణిస్తూ ఆనందాచారి రాసిన పంక్తులు చూసినప్పుడు నాకు ఆ వివాదాలన్నీ, ఆ భావ సంఘర్షణలన్నీ ఒకసారి మననంలోకి వచ్చాయి. ఆనందాచారి ఈ దీర్ఘ కవితలోనే ఒకచోట అన్నట్టు, సుందరయ్యగారు ఏదో మానవాతీత మహాశక్తి గానీ, మహాసృష్టి కానీ కాదు. ఆయన మన మధ్య నడిచిన, మనని నడిపించిన మహానాయకుడు. ఒక మహాస్వాప్నికుడు. ఒక మహా సాధకుడు.

సాహితీస్రవంతి, ప్రస్థానం చేస్తున్న ఉపయోగకరమైన పనులలో ముందు నడుస్తూనే ఆనందాచారి, కవికి ప్రాణప్రదమైన నిత్యచైతన్యాన్ని ఆరిపోకుండా జాగ్రత్త పడుతున్నందుకు నాకు సంతోషంగా వుంది. ఖమ్మం జిల్లా నుంచి ఎదిగివచ్చిన యాకూబ్, సీతారామ్ వంటి ఈనాటి ప్రముఖ కవుల సహపాఠి, సమకాలికుడైన ఆనందాచారిలో కూడా ఆ మెరుపు ఛాయలు కనిపిస్తున్నాయి. సుందరయ్యగారి మీద రాసిన ఈ సుదీర్ఘ కవిత చాలా సుందరంగా వుంది. నేను ఇష్టపడే సునాయాస శైలిలో వుంది. లాకులు దాటిన తరువాత ప్రవహించే కాలువలా వుంది ఆనందాచారి నడక. వచన కవిత్వం అంటే వచనం రాసి కవిత్వం అని పేరు పెట్టడం కాదని ఆనందాచారికి బాగానే అర్థమయ్యింది. కనుక ఈ ప్రయత్నాన్ని ఇంతటితో విరమించకుండా సుందరయ్యగారి జీవిత కథని ఒక చరిత్ర విద్యార్థి దృష్టితో మరికొంత నిశితంగా చూసి, పూర్తి నిడివి జీవిత కథా కావ్యం ఒకటి రాస్తే చూసి సంతోషించాలనుకుంటున్నాను. ఒక మంచి కవి దగ్గర వుండవలసిన కవితా సామాగ్రి అంతా ఇప్పటికే దాదాపు సిద్ధం చేసుకున్న ఆనందాచారికి ఇది కష్టం కాదనుకుంటాను. అందాకా, మనకి సుందరయ్య గారి గురించి ఇంత సారవంతమైన దీర్ఘ కవితని అందించినందుకు ఆనందాచారిని లాల్ సలామ్‌లతో మనసారా అభినందిస్తున్నాను.

25, ఏప్రిల్ 2013

# సత్యం శివం సుందరం

## తెలకపల్లి రవి

మానవ చరిత్రలో మహా కవిత్వమెప్పుడూ వీరగానమే. ఘన యోధుల త్యాగ ధనుల చరిత్రలను విరచించిన కవులూ వినిపించిన కంఠాలూ చరిత్ర పొడుగునా. కొన్ని పాటలు, కొన్ని పద్యాలు, కొన్ని కథలూ కొన్ని కావ్యాలూ ప్రపంచ సాహిత్యమంతటా దర్శన మిస్తాయి. ఇదే అదను లెనిన్ కథను రచించెదను నేను అన్న మయకోవస్కీ మహత్తర కావ్యం చప్పున గుర్తుకొస్తుంది.

ఇప్పుడు మిత్రుడు ఆనందాచారి అక్షరీకరించిన ఆరుణారుణ ఆదర్శం స్ఫూర్తి శిఖరం కూడా ఆ కోవలో నిల్చిపోయే నిండైన రచన. నిఖార్సయిన కవిత్వం. కథ కాకున్నా కథా నాయకుడు కష్టజీవుల తరపున పోరాడిన కదన యోధుడు గనకా.. ఆయనను అమితంగా ఆరాధించి అనుసరించిన నిబద్ధ కవి హృదయ స్పందన గనకా ..

*నేడున్నా లేకున్నా*
*నేడైనా రేపైనా*
*పరిణామాల్ని ఎవరూ ఆపేయలేరనీ*
*ఉదయాలనెవరూ తరిమేయలేరనీ*
*నమ్మిన వాళ్లం నమ్ముతున్న వాళ్లం*
*అందుకే ఆకాశమంత బలమున్నవాళ్లం*
*ఆశయాల్ని కలిగున్నవాళ్లం*
*నీ జ్ఞాపకాల్ని నెమరేస్తున్న వాళ్లం*
*నీ స్ఫూర్తిని స్మరిస్తున్నవాళ్లం*
*భవిష్యత్తులోకి పయనిస్తున్న వాళ్లం*

స్మరణతోనే ఆగిపోకుండా ఆశయ సాధనకై ఆచరణకు సన్నద్ధత ప్రకటించడమే ఈ అక్షరాంజలిలో ప్రత్యేకత. ఈ దీర్ఘ కవిత ప్రతి భాగంలోనూ ఈ ద్విముఖ చేతన ప్రత్యక్షమవుతుంది. సుందరయ్యను పొగిడేవాళ్లు చాలామంది వున్నా ఆయన ఆశయాలనూ వాటి వారసత్వాన్ని కొనసాగించేవాళ్లను తెగిడేందుకు దాన్ని ఉపయోగించుకోవడం చూస్తుంటాం. ఆయన గొప్పవాడే గానీ.. అంటూ నోటితో

నవ్వి నొసటితో వెక్కిరిస్తారు. ఆనందాచారి అలా గాకుండా అచ్చమైన ఆశయ వారసత్వాన్ని చాటి చెబుతాడు.

*ఒకరో ఇద్దరో*
*వారసులుంటే అది*
*రక్త సంబంధం*

*లక్షలాదిమంది నీ*
*వారసులంటే అది*
*కమ్యూనిస్టు సంబంధం*

**అందరూ నావాళ్లేనని అనుకున్నారు మీరు**
**అందుకే మీ ఆశయానికి వారసులయ్యాం మేము**

అంటూ ఒక ఉదాత్తానుబంధాన్ని ఉత్తమ కవిత్వ భాషలో ప్రకటించారు. సుందరయ్య గురించి నిరంతరం చెప్పుకునే ప్రసిద్ధ విశేషాలనే కవిత్వీకరించి నిక్షిప్తం చేశారు. ప్రతి చరణంలోనూ అక్షర చిత్రాలు చెక్కారు

*"లక్ష నక్షత్రాల కాంతిలా*
*లక్ష్యానికి వెలుగు చూపుతున్నావు"*
*"బతకటం జీవించడం కాక*
*నిరంతరం పోరాట తరంగ ధైర్యమై"*
*"కదనాన్ని నడిపించే ధీరుడవే కాదు*
*కవనాన్ని పరిశీలించే సమర్థుడవు "*
*"ఆశయ రథంపై ఎగరేసిన*
*పతాకం లాటి నీ జీవితం"*
*"ఏ వేదికనైనా వర్గ పోరాట క్షేత్రంగా*
*మలుచుకోవడంలో మెళకువను"* ఇలా.

జీవిత కథనంపై కవనం పట్టుగా నడపడం కష్టమైనా ప్రక్రియా పరమైన ప్రతిభ చూపించి ఆద్యంతం తూకం తూగు కొనసాగించాడు. సమకాలీన పరిణామాలను చెబుతూ గతంలోకి తీసుకెళ్లడం, గతం చెబుతూ వర్తమానంలోకి దూకించడం ఇలా పలురకాల పద్ధతులను పాటించడం వల్ల ఇది సాధ్యమైంది. సందర్భోచితమైన శైలి కావడం వల్ల కొన్ని చోట్ల భావుకత మరికొన్ని చోట్ల అచ్చమైన భౌతికత కూడా

మేళవించగలిగాడు. పార్లమెంటులో సుందరయ్య కృషిని చెప్పేముందు ప్రశ్నల కుంభకోణం ప్రస్తావించడం అలాటిదే. ప్రపంచీకరణ తీసుకొచ్చిన శకలీకరణపై చక్కటి వ్యాసాలు రాసిన ఆనంద్ కవితీకరించడంలోనూ అదే పదును చూపించడంలో ఆశ్చర్యంలేదు.

**కన్నుకన్నుకూ భిన్నమై పోతోంది/ సత్యాన్వేషణకు సంకెళ్లు బిగిస్తున్నాయి/ .. శాశ్వతంపై ప్రస్తుతం/ ఆశయంపై అవసరం/ సమగ్రతపై శకలం/ సారపై రూపం/ ఆధిపత్యం వహిస్తూనే వుంది ......** సుందరయ్యను కీర్తించడం లేదా అంతా అద్భుతంగా వుందని కవితాభాష గుప్పించడం గాక వాస్తవిక సమస్యలను ప్రస్తావిస్తూనే ఆశావహమైన భావుకతను మేళవించడం ఆనందాచారి కవిత్వంలో కనిపించే మరో విశేషం. ఎడాపెడా ధోరణులను అధిగమించి సిద్ధాంత స్వచ్ఛతను కాపాడేందుకు సుందరయ్య చేసిన కృషిని చెప్పడానికి కూడా అదే మార్గాన్ని అనుసరించాడాయన. పావురాలను ఎగరేస్తే శాంతి దూతలనుకుని అన్నప్పుడు నెహ్రూ సోషలిజంపై భ్రమలు పెంచుకోవడం అనివార్యంగా గుర్తుకొస్తుంది. విప్లవ పరిపక్వతపై విశ్లేషణ లేకుండా ముందే కూసిన కోయిలల్లా సమయం వచ్చేసిందని తొందరపడిన వారి గురించీ అంతే చక్కగా రాశారు. నిర్బంధాలు, నిరసనోద్యమాలు, విప్లవ పోరాటాలు అన్నిటినీ స్పృశిస్తూ సుందరయ్య ప్రస్థానం కళ్లకు కట్టించారు.

దీర్ఘ కవిత అని వర్ణించిన ఈ రచనకు మరీ సుదీర్ఘ పరిచయం రాయడం ఉచితం కాదు గాని ఆద్యంతాలకు సంబంధించిన రెండు ప్రస్తావనలు చేయకతప్పదు. సుందరయ్య ఆశయబద్ధుడైన ఘట్టంలో " ఆకాశానొక వేగు చుక్క పొడిచింది/ తూరుపు సిగలో మందారం పూసింది/ దారులన్నీ మోదుగు పూల వనాలయ్యాయి/రెక్కలు విప్పిన పక్షులు గగనవిహారం చేశాయి" అంటూనే **" నువ్వు/ హఠాత్తుగాఈ / లోకం మీదకు వొదిలిన/ అవతారమేమీ కాదు"** అని స్పష్టపరిచి ఒక్కొక్క పోగునూ ఏరికట్టిన గూడులా/ విప్లవాశయానికి జీవితాన్నిమలచి/ కష్టాల్ని శిరస్సుకెత్తుకుని/పోరాటాన్ని ముద్దాడినావు/ అందుకే నిన్ను గానం చేస్తున్నాను/ నీ చరితను చరణం చేస్తున్నాను ...గానాన్ని అమరం చేస్తున్నాను అంటూ ముగించాడు. చివరలో అన్నట్టు ఇది అక్షరాలా సత్యం శివం సుందరం.

సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శిగానే గాక ప్రగతిశీల కవిశ్రేణిలో భాగంగానూ సాహితీ లోకానికి సుపరిచితుడైన ఆనందాచారిని ఈ రచనకు గాను మనసారా అభినందిస్తున్నాను.

# ఆనంద బాష్పగానమిది

## సీతారాం

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గురించి, ఆయన స్వప్నాల గురించి, ఆశయాల గురించి, ఆలోచనల గురించి కవి మిత్రుడు చేస్తున్న ఆనంద బాష్పగానమిది. దు:ఖాశ్రువులను తుడిచిపెట్టి, కన్నీటికి ఎర్రరంగేసి, పదాలను ఆశయ పతాకాలుగా, వాక్యాలను అచంచల విశ్వాస వారధులుగా నిర్మిస్తున్నాడు.

తెలుగు కవిత్వం రైట్‌వింగ్ నాయకుల గురించి రాయాల్సిన దానికంటే ఎక్కువే రాసింది. లెఫ్ట్‌వింగ్ నాయకుల గురించి ఇప్పుడు కవులు రాయాల్సిన అవసరాన్ని గుర్తించాడు ఆనంద్.

శతజయంతికి శతసహస్ర సుత్తి, కొడవలి నక్షత్రాలను ఓ దీర్ఘశ్వాసలో మహత్తర ఆకాంక్షను వ్యక్తం చేశాడు.

ఉద్యమాలలో ప్రాణత్యాగాలు చేసిన వారిపై జ్ఞాపకగీతాలు, స్మృతిగీతాలు ఎన్నో ఉన్నాయి. అమరత్వాన్ని గానం చేసినవారూ ఉన్నారు. అజేయంగా, అచంచలంగా ఎర్రబారుతున్న ఉదిక్త, ఉద్విగ్న సమర సంరంభానికిది ఒక వేకువ గీతం కావాలి. కమ్యూనిస్టు నాయకులపై మరెన్నో కావ్యాలు రావాలి.

# నా కవితా స్మృతి

కె. ఆనందాచారి

సుందరయ్య గారు బ్రతికున్నకాలంలోనే వామపక్ష విద్యార్థి సంఘంలో పనిచేశాను. కొత్తగూడెంలో పార్టీ మహాసభలకు ఆయన వచ్చినప్పుడు మా గురువుగారు పి. రాజారావు గారితోపాటు సుందరయ్య ప్రక్కనే నిలబడి మాట్లాడే అదృష్టమూ దక్కింది. అప్పటికి గొప్పనాయకుడనీ తెలుసుకానీ ఎంత గొప్ప మనిషో తెలియదు. చరిత్రలో ఆయన పాత్రా తెలియదు.

1986లో 'విప్లవపథంలో నా పయనం' బహుమతిగా వచ్చిన పుస్తకాన్ని చదివాను. ఆ తర్వాత చాలా చదివాను. 2013లో సుందరయ్య గారి శతజయంతి సందర్భంగా నేనేమి చేయగలనని దాదాపు ఆరు నెలలుగా ఆలోచిస్తున్నాను. కాలపు ఒత్తిడిలో పడి అవసరాల పనుల్లో పడి కొట్టుకుపోతూనే శతజయంతి ముగింపుకొచ్చింది. నెల క్రితం మళ్ళీ ఆయన రాసుకున్న ఆయన చరిత్ర, సుందరయ్య విజ్ఞాన కేంద్రం వారు వేసిన సంకలనం, మొదలైనవన్నీ చదివాను. నిజంగా నాకు భయంవేసింది. ఒక దీర్ఘకవితలో ఆయన్ను బంధించటం అసాధ్యమనిపించింది. ఎంతటి మేధోసంపన్నుడో అంతటి ఆచరణశీలి. ఒక మనిషి తనను తాను ఎలా మలచుకోవచ్చునో చూపించినవాడు. మానవతకు నిండైనరూపం. ఒక్కటేమిటి అన్ని రంగాల్లోనూ అన్ని విషయాల్లోనూ అందించిన స్ఫూర్తి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఒక విప్లవకారుడు ఎలా వుండాలో ఆయనొక ఉదాహరణ. ఒక ప్రజా నాయకుడికి ప్రతిరూపం. నేటి ప్రపంచీకరణలో అగమ్య వేగాల్లో జీవితాన్ని ఒకసారి చూసుకుంటే, మనం జీవించడాన్ని మొదలుపెట్టకుండానే ఎలా ముగుస్తున్నామో, ముగియబడుతున్నామో ఆయన జీవితాన్ని చదివితే మనకు

తేటతెల్లమవుతుంది. కమ్యూనిస్టులే కాదు తెలుగువాళ్ళందరూ గర్వించదగ్గ మహామనీషి ఆయన.

నా కవితలో చెప్పుకున్నట్టుగానే ఆయన్నంతా కవిత్వీకరించడం నావల్ల కాలేదు. నాకు వీలైన కొద్దిగా, ఆయనకు నివాళిగా, నాకోసం నేను రాసుకున్నదాన్ని మీ ముందుకు తీసుకువస్తున్నాను. ఆయన ప్రతి జీవితపార్శ్వమూ ప్రేరణాభరితమే. అందుకే కొంతైనా మిమ్మల్ని కదిలిస్తుందని భావిస్తున్నాను. ఇది సమగ్ర సుందరయ్య గారి జీవితమూ కాదు, విప్లవపథ చరితాకాదు. ఆయన జీవితంపట్ల నా ప్రతిస్పందనా కవితా స్మృతి మాత్రమే. సాహిత్యరంగాన సుందరయ్యలాంటి మహెూన్నతుణ్ణి ఆవిష్కరించటం నాకెంతో ఆనందాన్నిస్తున్నది. ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఈ దీర్ఘకవితా కృషిలో నాకెందరో సహకరించారు. సుందరయ్య గారి శతజయంతి ప్రచురణగా సుందరయ్య విజ్ఞానకేంద్రం ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెస్తున్నందుకు కృతజ్ఞతలు. అడగ్గానే యాకూబ్ పరిచయంతో, సుందరయ్యగారి మీద వున్న ప్రేమతో ముందుమాట రాసిచ్చిన ప్రముఖకవి దేవీప్రియ గారికి, రాస్తున్న కవితను చూసి సలహాలందించి తన ఆప్తవాక్యాన్ని రాసిచ్చిన మిత్రుడు సీతారాంకు కృతజ్ఞతలు.

ఫోన్లోనే కవితను విని విశ్లేషణచేసి, కొండంత ఉత్సాహాన్నిచ్చిన గీత రచయిత, మిత్రుడు స్ఫూర్తికి, నా ఈ కవితకు మొదటి పాఠకుడు, సూచనలందించిన మిత్రుడు బండారు రమేష్, నా శ్రీమతి సుమతికి ధన్యవాదాలు. ప్రజానాట్యమండలి దేవేంద్రకు, హిమబిందు గారికి, నెల్లూరు నర్సింహారావు, భాస్కర్, నాగేశ్వరరావు, సాహితీ స్రవంతి మిత్రులు రౌతు రవి, పోతగాని, కటుకోర్వ్యల రమేశ్, కపిల రాంకుమార్, సాహితీప్రియులు పావన్ గారికి కృతజ్ఞతలు.

రాశానని చెప్పగానే అందమైన పుస్తకంగా తెద్దామని చెప్పి, అందుకు కృషిచేసిన ప్రజాశక్తి లక్ష్మయ్యగారికి, మా సాహితీ స్రవంతి అధ్యక్షులు తెలకపల్లి రవి గారికి, వొరప్రసాద్‌కు, మిత్రుడు జుగాష్‌విలి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.



# 1

ఒక్కడివో అనేకుడివో
ఆవేశానివో ఆశయానివో
సహనానివో, సమరానివో
ఒంటరివో, సమూహానివో
ఉద్యమ భాషవో, విప్లవశ్వాసవో
ఏదో ఏమి, అన్నీ నీవైన వాడివి వేడివి
మా నిరంతర చలనంలో
వెన్నంటిన కదలికవు
మేం ఎగరేసిన ఎర్రనిజెండాలో
నిగనిగలాడే అద్భుత మెరుపువి
నువ్వు లేవు .... కాదు కాదు
సిందూరమై తూరుపు మందారమై
ఆశయావరణానివై మాతోనే వున్నావు



లక్ష నక్షత్రాల కాంతిలా
లక్ష్యానికి వెలుగు చూపుతున్నావు !
నీకు వందేళ్ళు నిండుతున్న సందర్భాన
రెడ్ సెల్యూట్ సుందరయ్యా !
రెడ్ సెల్యూట్ !

## 2

ఓ శిఖర సమాన
ప్రేరణా జీవితాన్ని
నిత్య చేతనా సంకేతమైన
మహోన్నత వ్యక్తిత్వాన్ని
తలచుకుంటేనే
తనువంతా స్ఫూర్తి ప్రవాహమై నిండే రూపాన్ని
పుట్టుకకూ చావుకూ మధ్య
చెరిగిపోని చరిత్రను నింపిన
జీవన పరిణామాన్ని
వ్యక్తిగతావరణాన్ని శక్తిగతంగా



రూపుదిద్దుకున్న యుక్తిమత్వాన్ని
బ్రతకటం, జీవించడం కాక
నిరంతర పోరాట తరంగదైర్ఘ్యమై
ప్రవహించడాన్ని
అక్షరాల్లో బిగించడం
పదాలలోకి కుదించడం
వాక్యాల్లోకి అనువదించడం
నేను చేయలేను ! కానీ
నా మాటలతో స్పర్శిస్తాను !
ఆ స్పర్శలోనే ఉత్తేజితమౌతాను !
ఆ స్పర్శలోనే యుగాలు జీవిస్తాను !

## 3

శిథిలమైన ఆలోచనలు
గడ్డకట్టిన భావాలు



చీలికలు చీలికలుగా అక్షరాలు
పదాలతో తగాదాలు
అసంగతాల ఆధిక్యాలు
అరువులూ బరువులూ
కలల దారిద్ర్యాలు, అలల వైరుధ్యాలు
కనుల కొనల్లోన కదిలేటి సెలయేళ్ళు
బ్రతుకు దరులు దాటి కదలని అడుగులు
అంతరంగమే పెద్ద యుద్ధరంగమైంది
అస్పష్ట శత్రు కాలుష్యం
ఆవహించిన కాలాన ......
నీ పేరు చల్లని చెలిమ నీటి ఊటలా
మా సందిగ్ధాల సందేహాల దాహాల్ని తీరుస్తుంది
అన్నిటినీ అధిగమించే
ఆయుధాన్ని అందిస్తుంది
'సుందరయ్యా' ! అన్న శబ్దం
మా అందరయ్యలా ఈ నేల
ధ్వనిస్తూనే వుంది ! మా గుండె ప్రతిధ్వనిస్తూనే వుంది !



సముద్రమంత నిండుతనం
కొండంత గుండెతనం
నీ తలంపులో మాకందుతుంది
నీ అడుగుల జాడ ఆదర్శాల దారులై
మేం నిలబడిన మార్గాన కదిలివస్తున్నాయి!

4

మంచి కమ్యూనిస్టు ఎలా వుంటాడని
ఎవరైనా అడిగితే
అచ్చం నీలా వుంటాడని చూపిస్తున్నాం
మానవత అంటే?
పీడిత జనావళి బాధల పట్ల
నీ స్పందన కంటే వేరేమి ఉంటుంది !
ప్రజా నాయకుడంటే?
ఇదిగో సుందరయ్యను చూడమని
గర్వంగా చూపిస్తున్నాం



నిరాడంబరతకు, నిజాయితీకి
నీకంటే నిదర్శనం మరేముంది చెప్పు !

తెలంగాణ సాయుధ పోరాటం
యోధుడుగా నీ చరిత్రను ప్రస్ఫుటం చేసింది

కదనాన్ని నడిపించే ధీరుడవే కాదు
కవనాన్ని పరిశీలించే సమర్థుడవు

కఠిన కార్యాల కడలినైనా ఈదగల దృఢ సంకల్పుడవు
కానిపనులకు పూనుకోని యోచనాపరుడివి
మహా నాయకుడివి సుందరయ్యా !
ప్రజా నాయకుడివి అందరయా !

ఎన్నో మార్పులు
ఎన్నో సంక్షోభాలు
ఎన్నెన్నో పరిణామాలు
ఆక్రమించిన వ్యవస్థాతలంపై నుండి
నీ శత జన్మదిన సందర్భాన



మరోమారు నిన్ను మననం చేసుకుంటున్నాం
మరింత చైతన్యాన్ని
హృదిని నింపుకుంటున్నాం !

# 5

మమ్మల్ని మేం వెతుక్కుంటూ
క్షణం క్షణం పోగొట్టుకుంటున్న వేళ ...
సంఘర్షణల్లో పడి సత్తువ కోల్పోతున్న వేళ ...
నువ్వొక
మహాధీరునిలా
మానవతా పరిమళాలు వెదజల్లిన తరువులా
గురువులా
అరుణారుణ ఆశయాల తేరులా
వీరునిలా అమరునిలా
మా జ్ఞాపకాల జెండాపై
చైతన్యపు గుర్తువై ఎగురుతూనే వున్నావు !




ఆశయ రథంపై ఎగరేసిన
పతాకంలాంటి నీ జీవితం
ఆచరణల గతుకుల రహదారిపై
కొనసాగిన నీ ప్రయాణం
మాకో పుస్తకమై ఎన్నో పాఠాలను నేర్పుతోంది !
నీ త్యాగం సుగంధమై
ఉద్యమ పాదానికి పరిమళాలు అద్దుతోంది
నీ నిబద్ధ పయనం, అంకిత భావం
మా మనో నిశ్చయాన్ని పదునెక్కిస్తోంది
పునరంకితానికి పురికొల్పుతోంది !

రెడ్ సెల్యూట్ సుందరయ్యా
రెడ్ సెల్యూట్ !

6

ఎలా మరచిపోతాం చెప్పు
నువు ప్రారంభించిన కార్యమేదీ ఇంకా



పూర్తికానేలేదు
నీ పరిశీలన పరిశోధనా పాఠాలు
మా ప్రయాణానికి దిక్సూచిలా పనిచేస్తున్నాయి
అయినా లక్ష్యాన్ని చేరుకోవటానికి
ఎన్నో ఆటంకాలనెదుర్కొంటూనే వున్నాం
ఆకలి పోలేదు ఆవేదన తీరలేదు
అంతరాలు 'అంటిల్లా' లా పెరుగుతూనే ఉన్నాయి
అందినకాడికి తినేవారు ఇంకా పెరిగారే తప్ప
అందరికోసం పాటుపడేవారు అరుదైపోతున్నారు
నీతీ నియమాలు పాతరవేయబడ్డాయి
అవినీతి అందలమెక్కింది
సామ్రాజ్యవాదపు డేగ
ప్రపంచీకరణ మంత్ర జపంతో
ఆధిపత్య ఆక్రమణ సాగిస్తూనే వుంది

పెట్టుబడీ మతమూ
క్యాపిటలూ గతమూ సర్దుబాట్లు చేసుకుని



సామాన్యులపై సామూహిక దోపిడీకి
పాల్పడుతున్నాయి
ప్రజలనువేరుచేసి
వైరాన్ని ఉసిగొల్పుతున్నాయి
రెండు కళ్ళల్లో
ప్రతిబింబించే వాస్తవికత
కన్ను కన్నుకూ భిన్నమైపోతోంది
సత్యాన్వేషణకు సంకెళ్ళు బిగిస్తున్నాయి

శాశ్వతంపై ప్రస్తుతం
ఆశయంపై అవసరం
సమగ్రతపై శకలం
సారంపై రూపం
ఆధిపత్యం వహిస్తూనే వుంది !

ఇది తాత్కాలికమని
ఐక్యతకు ఆటంకమనీ
సమతకు విఘాతమనీ




తెలుసుకోక తప్పదు
తెలియపడకా తప్పదు !

# 7

అలగానిపాడు జన్మస్థలమైనా
నిను కాదనుకునే నేల ఈ దేశానలేదు
ఏ నేలన పుడితేయేమి? ఏ కుటుంబాన పెరిగితేయేమి?
ఎవరికోసం తపించాడనేది ముఖ్యం కదా
ఎవరికోసం జీవితాన్ని పంచాడనేది ప్రధానం కదా

పేదరికపు జాడలేవీ లేని ఇంటిలో
చదువుల సౌకర్యాల ఒడిలో
వివక్షతల వెతలనేవీ ఎదుర్కొనక పెరిగి
కొందరు మనుషులెందుకు అంటరానివారు?
కొందరెందుకు ఆకలి కత్తులకు తెగిపడుతున్నారు?
ఆధిపత్యమూ అణగి వుండడమూ



వేదనలు అల్లుకొన్న సాలెగూళ్ళలో
అవస్తలు పడుతున్న సమాజాన్ని చూశావు
ప్రశ్నల బాణాలను సంధించావు
ఎందుకెందుకని సమాధానాలకై అన్వేషించావు
అధ్యయనం పెంచావు
చదువుతున్నకొద్దీ
పరిశీలన పెరుగుతున్న కొద్దీ
దారుణాల కారణాలు కనిపించడం మొదలయ్యింది
పరపీడనపై తిరుగుబాటు
ప్రధానమై కదిలావు
స్వాతంత్ర్య సమరాంగణాన
సైనికుడై దూకావు
స్వేచ్ఛా పోరాటాల సింధువయా
సుందరయ్యా, మా సుందరయ్యా

సహచరుల, విప్లవకారుల
పరస్పర ఆలోచనల సంయోగ మథనంలో
చర్చోపచర్చల్లో, అధ్యయన అంతర్వివేచనలో



విముక్తి పంథా వికసించింది
నీదారేదో నీకర్థమయింది
నిర్మాణం మొదలైంది !
సుందరయ్యా ఓ సుందరయ్యా
ఉద్యమాలకు ఆత్మ బంధువయ్యా

లాభాల వేటలోపడి
వాళ్ళు దారుణ పీడనని సాగిస్తారు
శ్రమ ఫలాల దోపిడిపై
శ్రామికులు ఖడ్గమెత్తుతారు
సంఘటిత శక్తులైలేచి
శ్రామికరాజ్య సౌధాన్ని నిర్మిస్తారు
సమతా గీతాలను ఆలపిస్తారంటూ
మార్క్స్ అందించిన
మహా ఆయుధాన్ని ఎత్తుకున్నావు
ప్రజా యుద్ధానికి సన్నద్ధమయ్యావు
భారతావని ప్రజాక్షేత్రాన



విప్లవ బీజాలు చల్లేందుకు
కమ్యూనిస్టు కర్షకుడవయ్యావు
నిరంతర తపనాంతరుడవై కదిలిపోయావు

ఆకాశాన ఒక వేగుచుక్క పొడిచింది
తూరుపు సిగలో మందారం పూసింది
దారులన్నీ మోదుగుపూల వనాలయ్యాయి
రెక్కలు విప్పిన పక్షులు గగన విహారం చేశాయి
సముద్రపు అలల ఉధృతి పెరిగింది
చిన్న చిన్న పాదాలు
తమ ముద్రల్ని ముద్దాడుతూ
అడుగులో అడుగేసి సవ్వడి వినిపించాయి
అప్పుడే పుట్టిన శిశువు కేక
అవనంతా నిండుతున్నట్లు విస్తరించింది
ఆశల చిగురులపై నుండి
కోయిల గొంతెత్తి పాడింది



# 8

నీ దేహం నిండా
మనిషితనపు సువాసనలే
ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలోనూ మానవత
పెల్లుబుకుతూనే ఉంటుంది
ఓ శీతల పవన పలకరింపులా
మాటలు హాయిని నింపుతాయి
మాటలంటే .... అవి కేవలం
శబ్దాల్ని ధరించిన వాయువులు కావు

వాస్తవాలను ఒడిసిపట్టుకున్న
నిజాయితీ గ్రంథాలు !

కొన్ని కన్నీళ్ళను ఒలికించగానే
కరుణామయుడు కాలేడు



మౌనం మానవతకు గుర్తుకాదు
హృదయంతోపాటు చేతులు కదలాలి
మనిషంత ఆసరా అయి చేతలు పలకరించాలి

కరువు నిలువునా దహించివేస్తున్న వేళ
ద్రవించిన నీ హృది
గంజి కేంద్రమై వెలిసింది
చెరువులెండిపోతే శ్రమదానం ధైర్యమై
పూడికలు తీసింది.

కరువులు వరదలెత్తి కోరలు చాచినా
వరదల బాధలు ముంచెత్తినా
నేనున్నానని ప్రజల కన్నీళ్ళను తుడిచే ఓదార్పుల స్పర్శవై
స్వచ్ఛంద సేవా సేనానివై అమ్మలాంటి కమ్మదనానివై
ప్రజల ముందు నిలిచావు !
కామ్రేడ్ సుందరయ్యా !
సుందర కామ్రేడువయ్యా !



చదువుల నీడలేని ఎడారి ఊరిలో
అక్షరాల మొక్కను నాటి
కూలీల బిడ్డల కోసం
వెలుగుల గురువయ్యావు

వైద్యుడులేని చోట
రోగాలకు మందువు నీవై
కాయపుగాయాల బాధల తొలగించావు

సహకార ఆలోచనకు
ఆచరణరూపమిచ్చి
కారు చౌకగా సరుకులను
ఊరుజనుల కందించావు

రాతిరి చీకటిలో
జ్ఞానపు జ్యోతిని వెలిగించి
వయోజనుల బడిలో
నవోదయపు కాంక్షలు రగిలించావు



చదువు – ఆలోచనలకు రెక్కలు కడుతుందని
చదువు – తనను తాను చూసుకునే నేత్రమౌతుందని
ఇంటినే గ్రంథాలయం చేసి
ప్రజలతో నీవొక అనుబంధాలయమయ్యావు
త్యాగపు దారులకు ద్వారాలు తెరచి
సేవాగుణ సంపన్నుడవయ్యావు !
సుందరయ్యా ! మా మందారపు అందమయ్యా !

# 9

ఊరికి దూరంగా
అదిగో అక్కడో వాడ
ఆ వాడలో కర్మను కప్పుకున్న
నలనల్లని శరీరాలు
ఆకలి తీరటం కోసం
రెక్కలనెప్పుడూ
ఆడిస్తూనే వుంటారు.
ఆ వాడలో ఒక నీటిబావి



ఇదిగో ఇటువైపోవాడ
ఈ వాడలోనూ అలాంటివారే
ఇక్కడా ఒకబావి

ఆ బావి నీటికీ
ఈ బావి నీటికీ
కలిసిపోనంత కాలుష్యమేదో
మనుషుల మెదళ్ళలో నిండిపోయింది
అగాధమంత విభేదం ఉండిపోయింది

ఇంకో అసలు విషయముంది
ఈ రెండు వాడలూ
అసలు ఊరితో వెలికి
గురవుతూనే వున్నాయి
నిత్య అస్పృశ్యతకి బలౌతూనే వున్నాయి

మెదడు పొరలపై కట్టిన తెరలివి
మనుషత్వాన్ని కప్పేసిన కులపు కోటగోడలవి



వీటిని ధ్వంసం చేయాలని
నీటికి 'వర్ణం' పోవాలని
నిత్యం ఆలోచన చేశావు
ఊరందరివాడుగా
'వాడ' అందరి ఊరుగా
కలిసి మెలసి బతకాలని,
సహపంక్తి భోజనాలు స్వయంగా నడిపావు
నిరతం ఆచరణతోనే
ఐక్యతకై కృషి చేశావు
అణగారిన జనుల కోసం
అహర్నిశం పనిచేశావు
కామ్రేడ్ సుందరయ్యా
సుందర కామ్రేడువయ్యా

# 10


స్నేహపు బంగారు తీగలతో
బ్రతుకు బంధాలను చుట్టి



అన్యోన్యతా పందిరిపై
అల్లుకున్న తీగలు
లీలా సుందరయ్యలు !

ఆశయాల వెన్నెల్లో
ఆదర్శాల మల్లెల్ని పూయించారు
జీవితమంతా పరిమళించారు
ఒకరికి ఒకరై
అందరి కొరకై
ఆధిపత్యపు జాడల
నీడలేవీ పడకుండా
దంపతులంటే ఎలావుండాలో
నిరూపించారు !

ఆకాశంలో సగాన్ని
అసమానతా అగాధంలోకి
తోయొద్దనీ !



అతివలు జతకాకుండా
ఉద్యమగతి సాగదనీ

తరాలుగా దారుణ పీడన
తరుణులపై సాగుతోంది
ఒకరికి ఇంకొకరు
బానిసగా మారటం
మనసుకు సంకెళ్ళువేసి
మరలాగ మార్చటం
ఆస్తి నిండిన ఇంటిలోకి
ఆమెను కూడా త్రోసి
'మను'వాడిన నాటకానికి
మనిషితనం నుసిచేసి
సహనంతో భరించమనీ
సహ జీవనం సాగించమంటారు వాళ్ళు
అది అనాగరిక నేరమంటావు నువ్వు
ఈ ఘోరాన్ని చూస్తూ ఊరుకోననీ




మహిళల పక్షం వహించావు
సమ సమాజాన్ని సాధించాలంటూ
సమతాగుణ నిధివై
మమతల సిరులు పంచావు !

కామ్రేడ్ సుందరయ్యా
సుందర కామ్రేడువయ్యా

## 11

తమ కాలూ చేతుల్ని
పొలాలలో పొద్దంతా పిండుకొని
చెమటను జలాలుగా నించి
పంటలకు ప్రాణమై నిలిచినవాళ్ళు
పేదరికపు లోగిళ్ళలో ఆకళ్ల కలల్నికంటూ
పనులతోడుగా పెరిగినవాళ్ళు
వ్యవసాయ కార్మికులు!



సంఘమై కదిలితేనే
సమస్యలు తొలుగుతాయని
కార్మిక సంఘానికి నీవే
రూపాన్ని సమకూర్చావు
అణగారిన వర్గాలను ఏకం చేశావు
వర్గ జనుల బంధువయ్యా ఓ మా సుందరయ్యా !


## 12

పోరాటానికి అంకితమయిన వాడికి
ప్రాంతాల సరిహద్దులుంటాయా ?
అలజడి చెలరేగినపుడు
కెరటం ఎగిరిపడ్డట్టు
రాతిరికి కాలం మూడగానే
సూర్యుడు తూరుపు రథమెక్కినట్లు
ఉద్వేగం ఉప్పొంగగానే
కవిత్వం రెక్కలు తొడిగినట్లు



'తెలంగాణ' జన విముక్తి యుద్ధంలోకి
నీ అడుగులు కదిలాయి
అలల సవ్వడి పెరిగింది
అలజడి ఆయుధమైంది !

రైతులు, కూలీలు
పిల్లలు, తల్లులు, సామాన్యులూ
వెట్టి కొలిమిలో కాలుతున్న శరీరాలు
జమీందారుల దారుణాలు
గడీల దోపిడీల
నలిగిపోతూ కరిగిపోతూ కణలిపోతూ
కనురెప్పల క్రింద కోపాగ్నులు రాజుకుంటున్నవేళ
గుండెల్లో రక్తం మరుగుతున్నవేళ
నువ్వొక తిరుగుబాటు బావుటావై
పిడికిళ్ళెత్తిన ధైర్యానివై
చైతన్యపు అస్త్రాన్ని అందించావు
ఉద్యమ రథాన్ని నడిపించావు !



అణచివేత అధికారమై
దోపిడీ గూడు కాపలా కోసం
దౌర్జన్యాల ముళ్లకంచెలు పాతింది
నిజాము పైశాచికత్వం
ప్రజా కంఠాలు తెంపింది
సాయుధ రైతాంగ పోరు విప్లవ కెరటమై లేచింది
నువు బందూకువై ముందుకురికావు
శిక్షణ పొంది శిక్షణనిచ్చి క్రమశిక్షణతో కవాతు చేస్తూ
కదనరంగాన దూకావు
సాయుధ దళాల నిర్మాణం చేశావు
కమాండర్ సుందరయ్యా
కామ్రేడ్ సుందరయ్యా

'నీ బాంచ' నన్నవాడే నిలువెత్తు బాయినెట్టై పేలాడు
వీర తిలకాన్ని దిద్ది ఉరికొయ్యకు ఊగాడు
చరిత్ర గుర్తించని వాళ్ళు
చరిత్రను సృష్టించారు
దేశ విప్లవ సాధనకు మార్గం చూపించారు.




ఈ సమరం ఎన్నో గుణపాఠాలనిచ్చింది
విప్లవ వ్యూహానికి ఆలోచననిచ్చింది
దేశ విముక్తి కోసం ఇంకెంతో చైతన్యాన్ని
జాతి అంతా నింపుకోవాలని అంచనా వేసింది

ఆచరణ నుండే ఆలోచన పెరుగుతుంది
ఆలోచనలే తిరిగి ఆచరణై కదులుతాయి
విప్లవబాటలో గుణపాఠాల్ని పరచినవాడా !
పోరాటంలో వీరునివై మొలచినవాడా !
సుందరయ్యా, మా సుందరయ్యా !

# 13

పావురాలను ఎగరేస్తే
శాంతి దూతలనుకొని
మాటల గులాబీ తోటలో
సోషలిజం గుబాళిస్తుందని



నమ్మిన సహచరులంతా
కుడివైపుకు మరలినపుడు .....

విప్లవ స్వప్నాలతో, నేల విడిచి సాముచేయ
ఉద్రేకం ఉద్వేగం ఉప్పెనలై ఎగసిపడగ
ప్రజాయుద్ధ సైన్యమేదీ అండగ రాకుండానే
ఇది సమయం ఇక సమరం పద పదమని
కొందరు పరుగెట్టినపుడు .......

ఏ మాటలవెనుక ఏవర్గ లాభముందో
ఏ చేతల వెనుక 'మార్పు'కు మార్గమెంత వుందో
ఎరుగలేకపోతే కనుమరుగైపోతామని

విప్లవ పరిపక్వతపై విశ్లేషణ లేకుండా
శ్రామిక జనావళి సంఘటితం కాకుండా
పరుగెడితే పడిపోతామని
సమగ్ర విప్లవ ఆలోచనకు
ఆయువు నింపిన
ఆచరణ సిద్ధాంతాల సమన్వయకర్తా



సుందరయ్యా !
భారత విప్లవ వ్యూహకర్తవు మా సుందరయ్యా

# 14

కర్తవ్యం కదం తొక్కుతున్నపుడు
నిర్బంధం నిప్పులు కక్కింది
జైళ్ళు నోళ్ళు తెరచుకొని బుసలు కొట్టాయి
అపుడు కారాగారాలే కార్యాలయాలై
ఆలోచనల కరవాలాలకు పదును పెట్టాయి

వొత్తిడి పెరిగితే ఉబికి పైకెగిరినట్లు
నిబద్ధత మరింత గుండెను అద్దుకుంది
నిన్నెంతో ఉన్నతంగా నిలిపింది

రహస్య దళాల ఆవాసాలు
ఊళ్ళూ పేదల గూళ్ళూ
అరణ్యాలూ ఆకళ్ళు ఆశయాల దాహాలు



గొంగలి కప్పుకున్న నీ గంభీర రూపంలో
మాకెన్నో ఎన్నో దృశ్యాలు
పోరాటాలు, సంఘటనలు, కథలూ, గాథలూ
మాకెదురుగా నిలబడి సంభాషిస్తాయి, సంధానిస్తాయి
ఓ మాసుందరయ్యా మాలో చెరిగిపోని ముద్రవయ్యా
కామ్రేడ్ సుందరయ్యా !
సుందర కామ్రేడువయ్యా !

## 15

విప్లవతత్వాన్ని
నింపుకోవడమంటే...
విప్లవకారుడంటే...
ఆకాశంలో నిండిన వెలుగులనంతా
ఆస్వాదించాలి ఆఘ్రాణించాలి
లోకపు కొమ్మలపైకెగరి
దాహపు పక్షివోలె
జ్ఞానపు చిగుళ్లను గ్రహించాలి



వ్యాయామం చేయాలి
ఉరకాలి ఉద్రేకించాలి
నడవాలి ఆలోచించాలి
నదులలో ఈదాలి అడవిలో ఊగాలి
తుపాకిపట్టాలి కవాతు చేయాలి
కొండలెక్కాలి పైనుండి దూకాలి
వేడిలో చలిలో, నీటిలో బాటలో
చెట్లల్లో చెలిమల్లో
ఆవేశాల హోరులో
ఆశయాల దారుల్లో
నిన్ను నీవు అగ్గిలా రాజేసుకోవాలి
మొగ్గవై చైతన్యాన్ని పూయాలి

చరిత్రలోని జీవితాలను
గుండెల్లో అనువదించుకోవాలి
అధ్యయనం ఆహారంలా
మెదడు నింపుకోవాలి

ఆచరణల కండబలాన్ని
నిండుగా పెంచుకోవాలి



ఎన్నో ఎన్నెన్నో చేయాలనీ
ఆచరించి చూపినవాడా
ఆలోచన పంచినవాడా !

వాగ్దానంతో, వాంఛలతో
ఏదీ సాధించలేమనీ
వాస్తవ స్థితిపైనుండే
పోరాటానికి సాగాలనీ

బోధించినవాడా !
శోధించినవాడా


సుందరయ్యా మా సుందరయ్యా !

# 16

సూర్యునికి మసిపూయాలని
వెన్నెలకు పొగ పెట్టాలని
అద్దంలాంటి జీవితంపై



బురదనద్దాలని ఎన్నో ఎన్నో
ప్రయత్నాలు కొనసాగాయి
స్వచ్ఛతపై కల్మషాన్ని ఎగజిమ్మారు
నీతికి గోతులు తీసారు
నాటకాలు ఆడారు
మాటల్లో మాయలు నింపి
ప్రచార నీచాలకు పాల్పడ్డారు
ఎన్ని చేసినా
ఎన్నెన్ని విసిరినా
నిప్పును ఏం చేయగలదు శలభం !
నిటారుగా కదిలొచ్చే
అగ్గిని ఏం చేయగలదు మలినం !
నిప్పులాంటి నిజాయితీ నీవయ్యా
నిన్ను చూసి ఎర్రజెండా మురిసేనయ్యా !
సుందరయ్యా మా సుందరయ్యా



# 17

'అభ్యుదయ' సంచికలలో
అభ్యుదయాన్ని కొలిచి
నిగ్గుతేల్చినవాడా
సాహిత్య విమర్శకుడివై
సమగ్ర దృక్పథాన్నిచ్చినవాడా
వస్తు శిల్పాల అనల్పభావాల
విడమరచినవాడా
మాతృభాషలో విద్యా బోధనకు
సూత్రాలను చూపెట్టినవాడా
భాషా సమస్యల విశ్లేషించినవాడా

కళల్ని గళాల్ని
కలాల్ని కాలాన్ని
పట్టుకున్నవాడా, పదునుపెట్టినవాడా
నవశక్తుల్ని, ప్రజాశక్తిని




నడిపించినవాడా !
సాంస్కృతిక సాయుధుడా
సంస్కార భూషితుడా
సుందరయ్యా ఓ సుందరయ్యా !

# 18

ఇప్పుడు పార్లమెంటులో
ప్రశ్నలడిగినందుకు
పది లక్షలైనా కావాలి !

కోట్ల నోట్ల ఎరలు
ఓట్లుగా మార్చుకొని
పెట్టుబడీలోక సభలమెట్లనెక్కుతారు
లాభాల లాబీల లాలూచీ పనులతో
ఏ ముసుగూ లేకుండానే
లూఠీలు కొనసాగుతున్నాయి



ప్రజల గోడును వినిపించే గొంతుకలు
కరువౌతున్నాయి !

జైళ్ళలోనే మంత్రులు
మంతనాలు జరుపుతున్న కాలాన
నిజాయితీకి తిలోదకాలిచ్చి
మెజార్టీ కోసం ప్రాకులాడే సందర్భాన
ప్రజా ప్రతినిధిగా సైకిలుపై సభకెళ్ళడం
సామాన్యుల గుండె చప్పుళ్ళు
నీ గొంతులో ప్రతిధ్వనించడం
ప్రజల బాధల ఎజెండాను
సభ నిండా మ్రోగించిన నీ సామర్థ్యం
పాలకులనే నివ్వెరపరచింది


ఏ వేదికనైనా వర్గ పోరాట క్షేత్రంగా
మలచుకోవటంలో మెళకువను
లక్ష్యాన్ని మరువని జాగరూకతను
పార్లమెంటు భ్రమల పదవీ వ్యామోహాల
మలినపు వలలో చిక్కని చొక్కపు బంగారంలా



మెరిసిన నీ ప్రజా ప్రాతినిధ్య ప్రస్థానం
చరిత్ర గళాన ముత్యపు సరమై నిలుస్తుంది
స్వచ్ఛమైన ఆత్మవిమర్శా జలమై
మాకంటిన మురికిని కడిగేస్తుంది !
కామ్రేడ్ సుందరయ్యా !
సుందర కామ్రేడువయ్యా !

# 19

ఈ భూమిపై
అన్నము సృష్టిస్తున్న
రైతన్నల కోసం
వారి పొలాలను తడిపే
జలాల కోసం
పాలన చేసే వారెప్పుడైనా
ప్రణాళికలు వేసారా !
నిజాయితీగా ఏదైనా చేశారా !



జల యజ్ఞం ధన యజ్ఞమై
దళారి యజ్ఞమైపోయింది !
ప్రాజెక్టులేమోగానీ ప్రజాసొమ్ము
లూటీకి గురైంది
రైతు బతుకు కన్నీటిమయమైంది
కానీ ....

ఈనాటికీ
మన తెలుగు నేలలో
పారుతున్న నదీ జలాలను
ఎలా పంచుకోవాలో
ఎలా పదిలపరచుకోవాలో
పంటలకెలా పారించుకోవాలో
ఎవరైనా, ఎప్పుడైనా
నేడైనా నిజంగా ఆలోచన చేశారా !

ఎపుడో అపుడెపుడో నువు
నదులూ, చెరువులూ, కాలువలూ




అణువణువూ పరిశీలించి
'ఆంధ్రప్రదేశములో
సమగ్ర నీటి పథకాన్ని' ప్రకటించావు
ఇంజినీరులెవరూ చెయ్యలేని పనిని
సుందరయ్య చేశాడనిపించావు !
పరిష్కారాలను సూచించి
ప్రజల క్షేమానికై పరితపించావు
ఓ జల విధానకర్తా !
జన నినాదవక్తా !
సుందరయ్యా మా సుందరయ్యా

## 20

ఉద్యమం ఊరికేరాదు
ఆకలి అవస్థలున్నా రాదు
శోకం వెల్లువెత్తినా రాదు

చైతన్యపు శరాలనన్నీ

A.C.No. 94269
హైదరాబాద్-500032



వేగంగా సంధించినపుడు
ఆవేశం ఆలోచన ఏకత సాధించినపుడు
విప్లవాలు ఉదయాలై పొడుచుకొని వస్తాయి !

చైతన్యం ఊరికేరాదు
తెలిసుకొని పట్టుకోవాలి
తెలివితనం చుట్టుకోవాలి

తెలుసుకొనుట తేలికకాదు
తెలివితనం ఊరకరాదు

పరస్పరం ఘర్షించాలి
పరిశోధన గావించాలి
అధ్యయనం అవలోకనం
నిత్యాగ్నిని రాజెయ్యాలి

సామ్యవాద సాధకుడంటే
సాదాసీదాగా వాదన చేయటమేకాదు
వ్యవస్థ గర్భాన దాగిన



అవస్థల మూలాలను పట్టాలి
ఆ కాలానికి ఆ స్థలంలో
సమస్త జనావళికి మేలు సమకూరేదెలాగో
వివరంగా చూపెట్టాలి !

అందుకే నువ్వు
విశాలాంధ్రలో ప్రజారాజ్యమంటూ
సమగ్ర ప్రజా సౌభాగ్యానికి
సాధనాలేవో బంధనాలేవో
అనాడే తేటపరచావు
చరిత్ర వర్తమాన భవిష్యత్తును
విపులంగా ఆవిష్కరించావు !

ఈ నేలపై ఇపుడు
ఏ వర్గం ఎలా వుందో
గ్రామీణ ప్రాంతాలలో
భూమి ఎవరి చెంతనుందో



పంపకాల ప్రాధాన్యాలను
పరిశీలించడమెలాగో పరిశోధించావు
మట్టి బ్రతుకుల వెతల గతులను
వెట్టిచేసే దళిత జనుల స్థితులనూ
సాంస్కృతిక నేపథ్యాలను
సమస్త వాస్తవ చిత్రాలనూ అందించావు
విప్లవ అధ్యయనమెలానో నేర్పావు
సమగ్ర ఆలోచన ఎలా సంతరించుకోవాలో
ఆచరించి చూపినవాడా
సుందరయ్యా మా సుందరయ్యా


## 21

సహచరుడు, సన్నిహితుడు
సహోదరుడు
సమభావకుడు



మిత్రుడు, మించినవాడు
ఒకే భావాల
ఒకే మార్గాన
ఒకే మాటతో
ఒకే లక్ష్యంతో
ఒకే గమ్యంతో
ఒకే వేగంతో ఒకే రాగంతో

ఒకరి అడుగులో
ఒకరై నడిచే
ఒకే పిలుపుతో
ఒకరై పలికే
ఒకరి దు:ఖాల ఇంకొకరు పంచుకొని
ఒకరి కష్టాల ఇంకొకరు ఎత్తుకుని
ఒకరి స్ఫూర్తి నింకొకరు అద్దుకొని
ఒకరి త్యాగమింకొకరు ప్రేరణగ
ఒకరి అనుభవమింకొకరి పాఠముగ



కలిసి నడిచే
నడిచి కలిసే
కామ్రేడ్స్ అంటే
కుటుంబ బంధంకన్నా మిన్నగా తలచావు
ఆత్మీయంగా ఆదరంగా చూసావు
ఉద్యమాలకే జీవితాలనిచ్చినవారి
జీవనాల్ని పరిశీలించి, పరిష్కరించావు
అభిమానించావు
పెంచావు ప్రేమించావు

కామ్రేడ్ సుందరయ్యా
సుందర కామ్రేడువయ్యా !

# 22

పచ్చని చెట్లను
పట్టు వస్త్రంలా కట్టుకున్న ప్రకృతి



రుతురాగాల తీయందనాల
సంతోషాల వెల్లువలు
జీవ వైవిధ్యాలు
సెలయేళ్ళు, లేళ్ళు, ఊళ్ళు
పువ్వులు, పులుగులు
నవ్వుల నురగలు
నవ వసంత శోభిత దృశ్యాలు
నవలోక నిర్మాణ కలలు
ఈ సమాజాన నిజం కావాలని
ప్రకృతిని కొల్లగొట్టటం కాక
పదిలంగా కాపాడుకునే
కమ్యూనిస్టు వ్యవస్థను కలగన్నవాడా
కామ్రేడ్ సుందరయ్యా !

ఈ నేలపై
తమ వొంటిని మట్టి చేసుకుని
సంపదరాశుల సృష్టించిన
పనిమంతుల శ్రమధనవంతుల



బాధలను దు:ఖాలను పారద్రోలి
శ్రామికుల రాజ్యాన్ని స్థాపించాలని
శ్రమించినవాడా ఉద్యమించినవాడా

ఆకలిని సమాధిచేసి
ఆవేదన అంతము చూసి
నరాలు స్వరాలూ
గుండె లయల, భయాలనూత్రోసి
ఆనందాలు నిండిన నిలయమై
ఈ దేశం వెలుగొందాలని
ఆలోచించినవాడా !

చిట్టి చిట్టి చిలుకలూ
మామిడి కొమ్మలపై రెక్కలెగరేస్తూ
నొక్కులు పోతూన్న పలుకులతో
స్వేచ్ఛగా గొంతులు విప్పుతూ
ఈ ప్రపంచాన్ని గూర్చి పాటలు పాడాలని



ప్రయత్నాల ఒడిలో ఊయలలూగుతూ
విజ్ఞానపు రుచుల్ని ఆస్వాదిస్తూ ఎదగాలనీ
ఆ ఎదిగే బాలలందరికీ బడులందించాలనీ
చదువందించాలనీ తపించినవాడా!

పనిలేని తనం లేనితనం కడతేరిపోయి
యువశక్తుల్లోకి నూతన రక్తాన్ని నింపుకొని
రేపటి కొరకు చింతలు లేక
ఉరకలెత్తే ఉత్సాహంతో
అచంచల విశ్వాసంతో
భవిత రూపుదిద్దుకోవాలనీ కోరుకున్నవాడా!

గీతలనూ, తలరాతలనూ తీసేసి
వివక్షతల ముళ్ల కంచెల పెరికివేసి
దాడులకు దారుణాలకు చెల్లుచీటీ రాసి
మహిళా సమానతకు దారులు వేయాలనీ
పూనుకున్నవాడా!



ఎవరూ చూసేవారులేక
ఉన్నవాళ్ళూ దరిచేరనీక
ఒక పండుటాకు రాలిపోవటం
అనాథలుగా ఆశ్రమాల కోసం ఎదురుచూసి
ఓ అనుభవాల నిండుకుండ ఒలికిపోవటం
ఇక వుండదనీ నిండు జీవితానికి
భరోసాను ఖరారుచేస్తామనీ

సోషలిజం ఈ కలలను
సాకారం చేస్తుందని
ప్రజా విప్లవంతోనే
నవ కోయిల కూస్తుందనీ
అలుపెరుగని తలపులతో
అను నిత్యం కదలినవాడా !
కామ్రేడ్ సుందరయ్యా!
సుందర కామ్రేడువయ్యా!



# 23

తొణికిన స్వప్నం కాదు నీ ఆశయం
తొలగిన స్వర్గం కాదు నీ గమ్యం
తొలకరి చినుకు స్పర్శకు
పులకించే మట్టిపొరలు
పుడమినింకా నలిగిపోలేదు, కరిగిపోలేదు

చరిత్ర ముగిసిందన్నవారు
హీనులుగా మిగిలారు
నమూనాలు నేలకొరగితే
నవ్వి పొంగిపోయినవాళ్ళు
నవ్వులపాలై నేడు
సంక్షోభాల నూతిలో పడి అరుస్తున్నారు

కాస్ట్రో, ఛావెజ్ చైతన్యం
కాలానికి ఎదురీదింది




చెగువేరా యువతరాన
చెరగని బలమయ్యింది
సుందరయ్య ఒక్కడు కాదని
నీవు నడిచిన పథాన ఎందరో
కాలాన్ని మదిస్తున్నారు !
మునుముందుకు నడుస్తున్నారు!

## 24

ఒకరో ఇద్దరో
వారసులుంటే అది
రక్త సంబంధం

లక్షలాదిమంది నీ
వారసులుంటే అది
కమ్యూనిస్టు సంబంధం !

పిల్లలు లేరని మీకు
ఎవరంటారు చెప్పు!



మా చూపుల్లో మీ రూపం
చూడకుండా వుంటారా!

అందరూ నావాళ్ళేనని అనుకున్నారు మీరు
అందుకే మీ ఆశయానికి వారసులమయ్యాం మేము

ఈ తెలుగు నేల నిన్నుకనీ
ధన్యభూమిగా మారింది
నీ చరితను భరతజాతి
నింపుకొని మెరిసింది!

త్యాగాలను తనువంతా
కప్పుకొని బ్రతికినోళ్ళు
నీలాంటి నిప్పులాంటి
నేతలు మాకున్నందుకు
గర్వంగా, ధైర్యంగా
మునుముందుకు పోతున్నం



సుందరయ్యా ! మా సుందరయ్యా
మా అందరి అడుగుజాడ నీవయ్యా!

## 25


నిరంతర చింతనలో
అడుగడుగూ సంతకాలలో
మార్క్సిజపు రంగరింపులో
కాలపు ఉలి మలిచిన రూపం
సుందర సమున్నత ద్వీపం
నా హృదయంపై
భావాల రసముద్రలై రాగాలెత్తగా
నిన్ను గానం చేస్తున్నాను
గాలి తిత్తులకు ప్రాణం పోస్తున్నాను

నువ్వు
హఠాత్తుగా ఈ
లోకం మీదకి వొదిలిన
అవతారమేమీ కాదు



నువ్వేమీ
మానవాతీత
మహాశక్తివో సృష్టివో కాదు
పొరపాట్లూ పాట్లూ ఎన్నున్నా
నిత్యం ఆత్మను
కడిగేసుకుంటూ
తలెత్తుకు తిరిగిన వాడివి
లీషావ్‌చీ గీటురాయికి
నిరతం నిన్ను నీవు గీసుకొని చూసుకున్నవాడివి
భావాల బలాలపై
చేతల చైత్యాలపై
చెదరిపోని అడుగువై నిలబడ్డవాడివి
అందుకే
నిను గానం చేస్తున్నాను
నీ బ్రతుకును పల్లవి చేస్తున్నాను !

నువు
అజాత శత్రువేమీ కాదు



వర్గపోరులో శ్రామిక పక్షపాతివై
బలహీనుల కాపుకాసి
శత్రువెలెందరిపైనో
అస్త్రమై దూకినవాడివి
అగచాట్లకు గురైనవాడివి
అందుకే నిను గానం చేస్తున్నాను
నీ చరితను చరణం చేస్తున్నాను


నువ్వేమీ
ఒక్కసారిగా నాయకుడవైపోలేదు
ఒక్కొక్క పోగునూ పేరికట్టిన గూడులా
విప్లవాశయానికి జీవితాన్ని మలిచి
కష్టాల్ని శిరస్సుకెత్తుకుని
పోరాటాన్ని ముద్దాడినావు
అందుకే
నిను గానం చేస్తున్నాను
నీ ఆశయానికి అనురాగం పోస్తున్నాను !



నువ్విపుడు
అదృశ్యమై ఎటూపోలేదు
ఈ దేశంపై పరుచుకున్న ప్రతి
ఎర్రని ఎరుపులోనూ నీరూపు
కదులుతూనే వుంది
ఎందరో నీ దారిలో
త్యాగాల తోరణాలు కట్టి
సాగుతూనే వున్నారు
అందుకే
నిను గానం చేస్తున్నాను
గానాన్ని అమరం చేస్తున్నాను !

# 26

జననానికి
మరణానికి మధ్య
కాలపు వారధిపైన
ఎవడు చైతన్యపు భావాలను కట్టి



నడకల నవకేతనాన్ని ఎగరేస్తాడో
ఎవడు సత్యాన్ని ఆయుధంగా చేసుకొని
సమస్త దృశ్యాన్ని ఆవహిస్తాడో
ఎవడు తన శక్తిని రక్తాన్ని పిండి
జనం కొరకు వొదులుతాడో

వాడే ప్రతి గుండెలో బ్రతికుంటాడు
జ్ఞాపకాల నదిలో ప్రవహిస్తుంటాడు
సుందరయ్యా, మా సుందరయ్యా
మా గుండెలో ప్రవహించే నది నీవయ్యా!
మా గుండెలో ప్రవహించే నది నీవయ్యా!

ఏమున్నది చెప్పునీవు
మనకున్న బలమన్నది
ఈ దోపిడి పేకమేడ కూలిపోక తప్పదని
పీడనపై తిరుగుబాటు చారిత్రక సత్యమనీ



భావాలు చేతనమై
భౌతిక రూపాలెత్తితే
లోకపు చీకటినంతా
ఆకటి శోకమునంతా అంతం చేస్తామనీ
వాస్తవాల పునాదిపై నినాదాలు తలెత్తుతాయన్న
బలం మనది కదా!

నేనున్నా లేకున్నా
నేడైనా రేపయినా
పరిణామాల్ని ఎవరూ ఆపేయలేరనీ
ఉదయాలనెవరూ తరిమేయలేరనీ
నమ్మినవాళ్ళం నమ్ముతున్నవాళ్ళం
అందుకే ఆకాశమంత బలమున్నవాళ్ళం
ఆశయాల్ని కలిగున్న వాళ్ళం
నీ జ్ఞాపకాల్ని నెమరేస్తున్నవాళ్ళం



నీ స్ఫూర్తిని స్మరిస్తున్నవాళ్ళం
భవిష్యత్తులోకి పయనిస్తున్నవాళ్ళం

సుందరయ్యా, మా సుందరయ్యా
శిఖరమంత స్ఫూర్తివి నీవయా
సత్యం శివం సుందరానివయా
రెడ్ సెల్యూట్ కామ్రేడ్ సుందరయ్యా
రెడ్ సెల్యూట్ కామ్రేడ్ సుందరయ్యా

94269

spoorthi sikharam | long poem | k. anandachari



సుందరయ్యగారి మీద రాసిన ఈ సుదీర్ఘ కవిత చాలా సుందరంగా వుంది. నేను ఇష్టపడే సునాయాస శైలిలో వుంది. లాకులు దాటిన తరువాత ప్రవహించే కాలువలా వుంది ఆనందాచారి నడక.

– దేవిప్రియ

జీవిత కథనంపై కవనం పట్టుగా నడపడం కష్టమైనా ప్రక్రియా పరమైన ప్రతిభ చూపించి ఆద్యంతం తూకం తూగు కొనసాగించాడు. సమకాలీన పరిణామాలను చెబుతూ గతంలోకి తీసుకెళ్లడం, గతం చెబుతూ వర్తమానంలోకి దూకించడం ఇలా పలురకాల పద్ధతులను పాటించడం వల్ల ఇది సాధ్యమైంది. సందర్భోచితమైన శైలి కావడం వల్ల కొన్ని చోట్ల భావుకత మరికొన్ని చోట్ల అచ్చమైన భౌతికత కూడా మేళవించగలిగాడు.

– తెలకపల్లి రవి

సుందరయ్య విజ్ఞానకేంద్రం